పేద జంటకు వివాహం

దిల్‌సుఖ్‌నగర్ సత్యనారాయణస్వామి ఆలయంలో పేద జంటకు పెండ్లి చేసిన మొగుళ్లపల్లి యువసేన సభ్యులు

ఎల్బీనగర్, ఏప్రిల్ 4 : మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో మరో పేద జంటకు గురువారం ఉచిత వివాహం జరిపించారు. యువసేన ఆధ్వర్యంలో ఇది 213వ ఉచిత వివాహం. మొగుళ్ల పల్లి ఉపేందర్ గుప్తా ఆధ్వర్యంలో యువసేన ప్రతినిధులతోపాటు దాతల సహకారంతో వరుడు సందీప్, వధువు సుమన వివాహాన్ని దిల్‌సుఖ్‌నగర్‌లోని వీరవేంకట సత్యనారాయణ స్వామి ఆలయం హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి ఈటెల రాజేందర్ సతీమణి జముజ, చిదర రమేశ్, పులిగిల్ల రమేశ్, బాల్‌రెడ్డి, మహేశ్, రంగయ్య, కాశీనాథ్, కృష్ణమూర్తి, విజయ్, చంద్రమౌళి, శ్రీనివాస్, అరుణ్, వెంకటేశం, ఆంజనేయులు, మురళి యువసేన ప్రతినిధులు సత్యనారాయణ, రాఘవరెడ్డి, రాజన్న, శ్రావణ్, సాయి, మనోజ్, ఆనంద్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పారిశుధ్య అధికారుల వినూత్న అవగాహన

ఉప్పల్, ఏప్రిల్ 4 : పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ఉప్పల్ మున్సిపల్ అధికారులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా స్వచ్ఛ ఆటోకు చెత్తను అందజేస్తున్న కుటుంబాల పిల్లలకు ఫిస్తా హౌజ్ వారి హలీం కూపన్లను గురువారం అందజేశారు. ఈమేరకు స్వచ్ఛతపై ఉప్పల్ ఆదర్శనగర్, బీరప్ప గడ్డ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటేషన్ డీఈ చందన చౌహాన్ మాట్లాడుతూ స్వచ్ఛతపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచడంతోపాటు, చిన్నారులకు బాధ్యతలను తెలియజేసేవిధంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. హలీం కూపన్లు అందజేశామన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎస్ఎఫ్ఏ శ్రీరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 4 : డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ పైన నిర్మిస్తున్న అదనపు గదుల స్లాబ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 98 లక్షల వ్యయంతో అదనపు అంతస్తు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాగా కింది అంతస్తులో సీనియర్ సిటిజన్స్ కోసం అదనపు వసతులు కల్పించాలని, స్థానికంగా గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. శారదనగర్ కాలనీ ఫేస్-2 లో పార్క్ ఎత్తు తక్కువగా ఉండటంతో అందులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, పార్క్ ఎత్తు పెంచి గ్రిల్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగొని శ్రీధర్ గౌడ్, సీనియర్ నాయకులు భాస్కర్, సాగర్, కాలనీవాసులు నర్సింహారావు, సుబ్బారెడ్డి, సుధాకర్, ఇందిర, అరుణ, శ్రీనివాస్‌రావు, రాఖీ గౌడ్, సీనియర్ సిటిజన్స్ హనుమంతరావు, జగన్నాథరావు, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, చుక్కల్, మధు పాల్గొన్నారు.



శారదనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్మిస్తున్న అదనపు అంతస్తు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మానవత్వం చాటిన ఎమ్మెల్యే సబితారెడ్డి

- రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తిని దవాఖానకు తరలింపు

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు. ఏప్రిల్ 4 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గురువారం మండలంలో వివిధ గ్రామాల్లో జరిగిన వివాహాలకు హాజరై వస్తున్నారు. ఈ నేపథ్యంలో బైరాగిగూడ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాచులూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్ గాయపడ్డాడు. గమనించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తన వాహనాన్ని ఆపి ప్రమాదానికి గురైన వ్యక్తి వద్దకు వెళ్లి తాగునీరు అందించారు. ప్రమాద విషయం తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే సబితారెడ్డి మానవత్వం చాటారని సంతోషం వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి. ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్తిక్. దీక్షిత్‌రెడ్డి, వెంకటేశ్, సుదర్శన్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పల్, ఏప్రిల్ 4: ప్రజల ఆరోగ్య సంరక్షణకు తనవంతు తోడ్పాటు అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం ఎర్రగుంటకు చెందిన అశోక్ తల్లి నాచారంలోని ఓ దవాఖానలో అనారోగ్యంతో చికిత్స పొంతుదున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం దవాఖానకు వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుని, పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు.. దుర్వాసనతో అవస్థలు

- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆర్కేపురం, ఏప్రిల్ 4 : ఆర్కేపురం డివిజన్ రామకృష్ణాపురం రోడ్డు నంబర్ 2లోని ఖాళీ స్థలంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి డంప్ యార్డులా మారి దుర్వాసన వెదజల్లుతున్నది. పక్కనే పార్కు ఉండడంతో అక్కడికి వచ్చే వారు వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ చెత్త తరలించకపోవడంతో పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

పెరుగుతున్న దోమల వలన రాత్రి సమయంలో కునుకు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ స్థలంలో చెత్త, వ్యర్థాలు వేయవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్ప టికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని తక్షణం చెత్తనుంచి విముక్తి కలిగించాలని స్థానికులు, కాలనీ వాసులు కోరుతున్నారు.

రామకృష్ణాపురం రోడ్డు నంబర్ 2 ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త

స్టీల్ బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందే..

సైదాబాద్, ఏప్రిల్ 4 : స్టీల్‌బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను మార్చేంతవరకు పనులను నిలిపివేయాల్సిందేనని హనుమాన్ ఆలయ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. సంతోష్‌నగర్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణ పనులను గురువారం జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఎస్ఈ దత్తుపంత్, ఈఈ గోపాల్, నిర్మాణ సంస్థ మేనేజన్ శ్రీకాంత్ తదితరులు పరిశీలించారు. అనంతరం ఎస్ఈ హనుమాన్ ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ ప్రతినిధులు, బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నగర మాజీ డిప్యూటీ సుభాష్‌చందర్‌జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, కొత్తకాపు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పురాతన హనుమాన్ ఆలయానికి విఘాతం కలిగే విధంగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణంలో మార్పులు చేయాలన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వినయ్‌కిశోర్ యాదవ్, శ్రవణ్‌కుమార్, మహేశ్ కుమార్, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వినోద్, నిరంజన్ పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను గౌరవిస్తాం : ఎస్ఈ

స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంతో హనుమాన్ ఆలయానికి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని, భక్తుల మనోభావాలను గౌరవిస్తామని ప్రాజెక్టు ఎస్ఈ దత్తుపంత్ అన్నారు.. అలైన్‌మెంట్ మార్పు కోసం క్షేత్రస్థాయిలో త్వరలోనే సర్వే చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ సమీపంలో ఎటువంటి పనులు జరగకుండా నిర్మాణ సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌ను అదేశించినట్లు తెలిపారు. మరోసారి జీహెచ్ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయిలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి, స్థానికులు, భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోనున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ పేర్కొన్నారు.

బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చిస్తున్న జీహెచ్ఎంసీ ఎస్ఈ దత్తుపంత్

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

బీఎన్‌రెడ్డి నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణదాస్, తదితరులు

వనస్థలిపురం, ఏప్రిల్ 4 : బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని సెన్సార్ బోర్డు సభ్యుడు కృష్ణదాస్ అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ బస్టాప్‌లో గద్దె విజయ్ నేత ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయడం మన సంస్కృతిలో భాగమన్నారు. ఎండలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా నీరు తాగాలన్నారు. తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని సూచించారు. చిన్న పిల్లలను ఎండలోకి వెళ్లనీయ వద్దని కోరారు. కార్యక్రమంలో పీవీ చౌదరి, పాండు, గిరి యాదవ్, పద్మ, శేఖర్, రాజు, మధు, గిరి, సైదులు, శ్రీను, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేయకపోతే కేంద్రంపై పోరాటం



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, ఏప్రిల్ 4: బీసీలకు సామాజిక న్యాయం చేయకపోతే కేంద్ర ప్రభుత్వంపై మిలిటెంట్ పోరాటం చేస్తామని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు ఇస్తూ, 15 లక్షల ఉద్యోగాలను ప్రకటించిన పార్టీలకే బీసీల పూర్తి మద్దతు ప్రకటిస్తామన్నారు. జాతీయ బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో పలు రాష్ట్రాల బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 10 సీట్లు కేటాయించి, బీసీ డిమాండ్లపై విధి, విధాన ప్రకటన చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 56 కార్పొరేషన్లను కేటాయించాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 20 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భరత్‌సుందర్, నీల వెంకటేశ్, వేముల రామకృష్ణ, నందగోపాల్, అంజి, సుధాకర్, రాజ్‌కుమార్, రాందేవ్‌మోడీ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాక పద సాహితికి వెంకట్ సేవలు అద్వితీయం

చిన్మయ చింతనం పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రకాశ్‌చంద్ర బరోడ్, వెంకట్ గరికపాటి

రవీంద్రభారతి,ఏప్రిల్ 4 : తాళ్లపాక పద సాహిత్యానికి వెంకట్ గరిపాటి చేస్తున్న సేవలు అద్వితీయమని స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ ప్రకాశ్ చంద్ర బరోడ్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త సుధామ మాట్లాడుతూ వెంకట్ గరిపాటి అన్నమయ్య అన్న పదానికి పర్యాయ పదంగా మారాడని అన్నారు. ఈ సందర్భంగా గరికపాటి 20వ పుస్తకం, చినతిరుమలయ్య సంకీర్తనలపై వ్యాఖ్యానం సమకూర్చబడిన 'చిన్మయ చింతనం' గ్రంథం ఆవిష్కరించారు. శ్రీరామ సాంస్కృతిక సంస్థ సారథి గొర్తి చంద్రశేఖర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నేతలు

బడంగ్‌పేట, ఏప్రిల్ 4 : మహేశ్వరం నియోజకవర్గంలో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసల పర్వం పరం కొనసాగుతున్నది. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భవానీవెంకట్‌రెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఫర్హానాజ్ బేగం, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేటర్ పవన్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కిరణ్ గౌడ్, డీ. కృష్ణవేణీయాదయ్య, రాజేశ్, కౌన్సిల్ శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ ఎక్బాల్ ఇన్ ఖలీఫా, కొం డల్ యాదవ్, సాద్ అవల్గి, మజార్ అలీ, భాషమ్మ, శ్రవణ్, సయ్యద్ యూసుఫ్ పటేల్, తదితరులు బీఆర్ఎస్ పార్టీని వీడి ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బీజేపీ నుంచి..

బీజేపీ మీర్‌పేట మున్సిపల్ కార్పొరేటర్ పద్మ, బీజేవైఎం మున్సిపాలిటీ ప్రెసిడెంట్ ముఖేశ్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ. నర్సింహయాదవ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అనితానాయక్, మాజీ ఎంపీటీసీ సిద్ధాల దశరథ ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సీఎం సమక్షంలో జడ్పీటీసీ జంగారెడ్డి ..

కందుకూరు : జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లిన ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయన వెంట పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

బెస్ట్ బిల్ కలెక్టర్ వేణు

అంబర్‌పేట, ఏప్రిల్ 4 : ఆర్థిక సంవత్సరం(2023-24)లో అంబర్‌పేట సర్కిల్‌లో టార్గెట్‌ను మించి అధికారులు ఆస్తిపన్ను వసూలు చేశారు. ఇందులో బిల్ కలెక్టర్ వేణు కీలక పాత్ర వహించారు. దీనికిగానూ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ వేణుకు బెస్ట్ బిల్‌కలెక్టర్ అవార్డును అందజేశారు. డీసీతో పాటు మిగతా బిల్‌కలెక్టర్లను, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లును అభినందించారు.

తాగునీరు కలుషితం.. ఆందోళనలో జనం

- వారాలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్న మోహన్‌నగర్ బస్తీ, కాలనీ వాసులు

ఎల్బీనగర్ , ఏప్రిల్ 4 : ఒకవైపు నీటి కొరత, మరోవైపు కలుషిత తాగునీటి సరఫరాతో పలు కాలనీలు, బస్తీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి పైప్‌లైన్‌లో మురుగునీరు కలుస్తుందంటూ ఫిర్యాదు చేసినప్పటికీ జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదంటూ వివిధ కాలనీల వాసులు వాపోతున్నారు. కొత్తపేట డివిజన్‌లోని మోహన్‌నగర్ బస్తీ, కాలనీతోపాటు సత్యనగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలుగుతున్నాయి. తాగునీటిలో మురుగునీరు కలుస్తుండటంతో ప్రజలు రోగాలబారిన పడతామేమోనని ఆందోళన చెందుతున్నారు.

వేసవి కావడంతో మంచినీటికి డిమాండ్ ఉండటం, రెండురోజులకోమారు వచ్చే తాగునీరు కలుషితమై రావడంతో తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోహన్‌నగర్ బస్తీలో ప్రభుత్వ పాఠశాల ఎదుట చిత్తారమ్మ దేవాలయం వెళ్లే దారిలో తాగునీటి పైప్‌లైన్‌లో మురుగునీరు కలిసి వస్తుండటంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అధికారులు సిబ్బందితో అక్కడ ఒక గొయ్యిని తవ్వి వదిలేశారు. పదిహేను రోజులైనా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించి వెంటనే సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. అదేవిధంగా మోహన్‌నగర్ కాలనీలో తాగునీటిలో మురుగునీరు కలిసి వస్తుందని కాలనీవాసులు కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ బాటిల్‌లో నీటిని పట్టి చూపించారు. సమస్యలను పరిష్కరించాలని జలమండలి అధికారులను కోరినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. తమ కాలనీలో మురుగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మోహన్‌నగర్ బస్తీ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

మోహన్‌నగర్‌లో జలమండలి అధికారులు, సిబ్బంది తవ్వి వదిలేసిన గుంత

మోహన్‌నగర్‌లో కలుషిత నీటి సమస్యను కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు వివరిస్తున్న కాలనీవాసులు

ప్రతి ఒక్కరూ సేవను కర్తవ్యంగా భావించాలి

సైదాబాద్, ఏప్రిల్ 4 : అనాథ పిల్లలను చేరదీసి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు వీహెచ్‌పీ దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని వీహెచ్‌పీ జాతీయ సహ సంఘటన కార్యదర్శి వినాయకరావు పాండే అన్నారు. గురువారం కృష్ణానగర్ కాలనీలోని కరుణశ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కారుణ్య సింధు బాలుర ఆశ్రమం రజతోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి హిందువు తమ ఆత్మబంధువు అనే భావనతో ఉండాలన్నారు. సేవ చేయటమంటే జాలి, దయ, కాదని, దానిని కర్తవ్యంగా భావించాలన్నారు. అనంతరం ఆశ్రమం మూడో అంతస్తు భవనాన్ని, సోలార్ ప్రాజెక్టును ప్రారంభించారు. కార్యక్రమంలో కరుణశ్రీసేవా సమితి అధ్యక్షుడు కడారి సత్యమూర్తి, వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన కార్యదర్శి సత్యంజీ, వీహెచ్‌పీ తెలంగాణ అధ్యక్షుడు బి. నర్సింహమూర్తి, నాయకులు బండారు రమేశ్, పండరినాథ్, రాజేందర్‌రెడ్డి,వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అతిథులకు జ్ఞాపికలను అందజేసి సత్కరిస్తున్న నిర్వాహకులు

పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

- పట్టించుకోని అధికారులు
- నిత్యం రోడ్డుపై మురుగు.. పరుగు
- దుర్వాసనతో కాలనీవాసుల అవస్థలు

ఉప్పల్, ఏప్రిల్ 4: రోడ్డుపై డ్రైనేజీనీరు పొంగిపొర్లుతుంది. నిత్యం మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మురుగునీరు రోడ్డుపై పారుతుంది. హబ్సిగూడ రవీంద్రనగర్‌కాలనీలో నిత్యం ఇదేతంతు కొనసాగుతుంది. ఉదయం పాఠశాలకు, కార్యాలయాలకు వెళ్లే వారికి తిప్పలు తప్పడంలేదు. దీనికితోడు రోడ్డుపై వెళ్లేవారికి దుర్వాసన వస్తుండంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లడంతో పాటు, మ్యాన్‌హోల్‌కు రంధ్రం చేసి, సమీపంలోని వరదనీటి కాలువ ద్వారా చెరువులోకి మురుగునీటిని పంపుతున్నారు. ఇటీవలే చెరువు సంరక్షణ చేపట్టాలని కోర్టు సైతం అధికారులకు ఆదేశాలు ఇచ్చిన మార్పురావడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీరు సమీపంలోని చెరువులోకి చేరుతుండటంతో పరిసర ప్రాంతాల కాలనీవాసులకు దుర్గంధం వెదజల్లుతున్నది. మురుగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.ఫిర్యాదులు చేసిన శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హబ్సిగూడ రవీంద్రనగర్‌కాలనీలో పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్

తీగలను కలిసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

ఆర్కేపురం, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డి గురువారం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని టీకేఆర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు బేర బాలకిషన్, తదితరులు రంజిత్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన పేర్కొన్నారు.

'జన జాతర' సభను జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న అఫ్జల్ భేగ్

కందుకూరు. ఏప్రిల్ 4 : కాంగ్రెస్ పార్టీ ఈనెల 6న తుక్కుగూడలో తలపెట్టిన 'జన జాతర' బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్ కోరారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నిర్వహించే ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెలు, ఎంపీ అభ్యర్థులు పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, శ్రీధర్ ముదిరాజ్, నర్సింహులు పాల్గొన్నారు.

మ్యూజికల్ జర్నీ హైదరాబాద్ టూ అమెరికా

రవీంద్రభారతి,ఏప్రిల్ 4 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ ప్రోత్సహంతో కాలిఫోర్నియా తెలుగు సంఘం వారి ఆహ్వానం మేరకు సత్యశ్రీనాథ్ థియేటర్ అండ్ మ్యూజికల్ జర్నీ హైదరాబాద్ టూ అమెరికాలోని కాలిఫోర్నియాలోని సాన్‌ఫ్రాన్సిస్కో లాస్ ఏంజిల్స్ లాంటి ప్రముఖ నగరాలలో సత్యశ్రీనాథ్ టీం ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు కాలిఫోర్నియా తెలుగు సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. సత్యశ్రీనాథ్‌తోపాటు రేఖ, నాగభాస్కర్, అజయ్‌బాబు, పుష్ప, రాఘవ, శివ, ప్రవీణ్ ,వీర మనోహర్ కావలి, ఆకాశవాణి ప్రభు, స్వాతి ఎంపికయ్యారు.